# వంటింటి రాజకీయం!

'గడేకారుసజ్జు' అనే మాట ఎప్పుడేనా విన్నారా? అంటే "అన్నీ మాకే తెలుసు అనే గర్వంతో ఊగిపోతూ, కాలరెగరేసుకుని కాళ్ళు ఝాడించుకుంటూ పనిలేకుండా ఊరంతా తిరిగే ఉల్ఫాగేంగ్" అన్నమాట.

మాది గడేకాటుసజ్జు అని అంతా అంటారుకాని, అది న్యాయం కాదంటాను నేను. మాకు పని లేకపోవడమేమిటి - అందరం కాస్తో కూస్తో ఉద్యోగాలు చేస్తూన్న వాళ్ళమే! సదరు సజ్జుఅనబడే మా సంఘంలో సభ్యులం అయిదుగురం. నేనూ సుబ్రహ్మణ్యం, పాండురంగ, అవధానులు, చిదంబరం. ఒక్క సుబ్రహ్మణ్యం తప్ప తక్కిన నలుగురం ఘోటక బ్రహ్మచారులం. ప్రస్తుతం వాడూ ఒకరకంగా బ్రహ్మచారే. నెలకి రెండు మూడు రోజులు వాడు ఇంట్లో వంట వండవలసి వచ్చి, ఆ కార్యక్రమాన్ని వాడు భయంకరంగా నిర్వర్తించడంతో, అతని వంట మహాత్యం వంట బట్టి, హడలిపోయి, "నీకూ నీ పాకశాసన ప్రావీణ్యానికీ ఓ నమస్కారం" అంటూ తాత్కాలిక ప్రాతిపదిక మీద, ఆమె పుట్టింటికి పారిపోయిందని, వాడంటే కిట్టని వాళ్ళెవరో పుకారులేవదీశారు. - అందులో సత్యాసత్యాల్ని అలా ఉంచితే, ఒకటి మాత్రం సత్యం - వాడూ మా గడే కారు సజ్జులోకి వచ్చి చేరాడు.

మాసజ్జుకి కేంద్ర ప్రభుత్వం ఆదర్శం. ఏమంటే, మేం కూడా ఒక్కొక్కప్పుడు ఏం నిర్ణయం తీసుకుంటామో మాకే తెలియదు. మానిర్ణయం కారణంగా ఏదో ఒక భయంకరమైన సమస్య పుట్టుకొచ్చి, పరిష్కరించడానికి వీలు లేని స్థాయికి చేరుకుని పీట ముళ్ళు పడిపోయినా, చివరకి మా కాళ్ళకీ చేతులకీ సంకెళ్ళుగా తయారయినా, మేం జంకం. ఆ నిర్ణయాన్ని మార్చుకోం. కేంద్ర ప్రభుత్వంలాగ, కుడితిలో పడ్డ ఎలకలా కొట్టుకోడానికైనా సిద్ధపడతాం కానీ, వెనకంజ వెయ్యం. అది అంతర్జాతీయ స్థాయికి ఎదిగితే ఎదుగుగాక - భద్రతా సంఘ చర్చనీయాంశంగా మారితే మారుగాక, మా నిర్ణయం మాదే!

అవునా?

మా సంఘం ఓ మాటు హోటల్ అయ్యరు మీద అలిగి, అప్పటికప్పుడు అర్ధరాత్రి సమావేశం ఒకటి ఏర్పాటు చేసి, అందులో స్వహస్తపాకం ప్రారంభించాలనే అమోఘమైన తీర్మానాన్ని ఓదాన్ని చేసి పారేసింది. తీరా తీర్మానం చేసి పారేశాక కాని మాలో ఒక్కడికీ తెలివి రాలేదు "దీన్ని విజయవంతంగా అమలు జరపడం ఎలా" అనే ఆలోచన.

"ముందూ వెనకా ఆలోచించకుండా మరీ రాజకీయవేత్తల్లా ప్రవర్తిస్తే ఎలారా? తీర్మానం తీగలతో కాళ్ళూ చేతులూ కట్టేసుకున్నాం. స్వహస్తపాకం అంటూ రేపట్నుంచి వంట మొదలెట్టాలంటే ఎలా? మనలో ఒక్కడికేనా వంటొచ్చా?" అని సన్నసన్నగా చీవాట్లుపెట్టాను. అప్పుడు మీనమేషాలు లెక్కించడం మొదలెట్టారు మావాళ్ళు -

నిజమే! తినడమే కాని, ఆ తినేది ఎలా తయారవుతుందో బొత్తిగా తెలియదు మాలో ఒక్కడికీను. బియ్యాన్ని అన్నంగా మార్చే ప్రయత్నాలు ఇంత క్రితం సుబ్రహ్మణ్యం చేశాడు - నిజమే! కాని ఆ ప్రయత్నాలేకదా బెడిసికొట్టి వాళ్ళావిడని పుట్టింటికి తరిమేశాయి? అందువల్ల వాడిని కూడా క్వాలిఫైడ్‌కుక్కుగా లెఖ్ఖకట్టడానికి వీల్లేదు-

వంట సంగతి సరే - అసలు దానిగురించి ఆలోచించడానికి మాలో ఖాళీ ఎవరికేడిసింది. అంతా తొమ్మిదిన్నర అయేటప్పటికి ఉద్యోగాల కోసం, పరిగెట్టేవాళ్ళే - పోనీ అనిపెందరాళే లేచే మొహం ఏదైనా ఉందా అంటే, ఎనిమిది గంటలముందు ఒక్కడూ మంచం దిగడు. దిగాక మొహాలే కడుగుతారా, గెడ్డాలే గీస్తారా, నడ్డే బిగిస్తారా, అడ్డెడుగిన్నే వారుస్తారా?

సరే - చేసిన తెలివి తక్కువ తీర్మానం ఎలాగా చేసేశాం. అది సరిదిద్దుకోడానికి "రేపటినుంచి అందరూ అయిదు గంటలకే లేవాలి"ని ఓ అనుబంధ తీర్మానాన్ని ప్రవేశ పెట్టి, అంతా అందుకు అంగీకరించాలని 'విప్' జారీ చేశాను. అందరూ ఏడుపు మొహాల్తో చేతులెత్తారు.

స్వహస్త పాక పరిపాలన విజయవంతంగా సాగాలంటే, దానికో ప్రభుత్వమూ, ఆ ప్రభుత్వానికి పరిపాలనా దక్షుడైన ప్రధానమంత్రీ ఉండాలి. మాలో కాస్తో కూస్తో అన్న హృదయం తెలిసిన వాడూ, కొన్ని సార్లయినా చెయ్యి కాల్చుకున్న వాడూ, ఒక్క సుబ్రహ్మణ్యమే!

డెమాక్రాటిక్ సూత్రం పాటిస్తే డేంజర్ అవుతుందని భయపడి, ఇందిరాగాంధీసీ

వో మారు తల్చుకొని, అంతరాత్మ ప్రబోధం ఆధారంగా సుబ్రహ్మణ్యాన్ని పార్టీ నాయకుడిగా ఎన్నుకొని, కేబినెట్ ఫారమ్ చెయ్యమన్నాం - కనీసం ఉడికీ ఉడకని మెతుకులైనా వండి (అకారణంగా ఆ మహాఇల్లాలు గుండె బేజారయి పుట్టింటికి పారిపోయిందంటే అది వేరే విషయం) వడ్డించిన శాల్తీ వాడు. అందువల్ల మా అందరినెత్తి మీదా సీనియర్ లీడరయి కూర్చున్నాడు - తప్పదు. పైగా అన్నం వార్పుకీ సంబారాల చేర్పుకీ కావలసిన ఓర్పూ, తెలియని వంటకాన్ని కూడా తెలిసినట్లు వండగలనేర్పూ ఉన్నవాడు వాడు -

ప్రధాని అన్నాంకదండీ - ప్రధానమైన శాఖలన్నీ తన కింద పెట్టుకుని, తక్కిన శాఖల్ని మా నలుగురికీ పంచాడు సుబ్రహ్మణ్యం.

కిరాణా కొట్లో సరుకులు కొని ఇంటికి రవాణా చేసే, వాణిజ్య రవణా శాఖ నాకు అప్పగించాడు.

వీధిలోని కుళాయి దగ్గర్నుంచి, వంటింట్లోని బిందెల్లోకి నీరు ప్రవహింప జేయవలసిన నీటి పారుదల శాఖని పాండురంగకి కేటాయించాడు.

బియ్యంలో బెడ్డలు ఏరుట, మిరపకాయ ముచికలు తీయుటవంటి అవినీతి నిర్మూలన శాఖని అవధానులికి ఇచ్చాడు.

కంచాలు కడుగుట, ఎంగిళ్ళు ఎత్తుట వంటి పారిశుధ్య శాఖని మాలో చిన్నవాడైన చిదంబరాన్ని తీసుకోమన్నాడు.

ఇంక తను పొయ్యి ముందు ఉన్నతాసనం వేసుకుని కూర్చుంటాడుట. వంట అనబడే పార్లమెంటు సాగుతున్నంతసేపూ తను కదలడుట. మేము మాత్రం మా మా శాఖలు నిర్వహిస్తూనే, అతని చుట్టూ ఉపగ్రహాల్లా తిరుగుతూ, కావలసిన వస్తువుల్ని అందిస్తూ, అతను అప్పటికప్పుడు పురమాయించే ఇతర పనులు చెయ్యాలట. దానికితోడు మూడు ఆంక్షలు కూడా విధించాడు.

పార్లమెంటు సమావేశమయే సమయాల్లో, అనగా, ఉదయం ఆరూ తొమ్మిదీ మధ్యా, సాయంత్రం అయిదూ ఏడూ మధ్యా,సభ్యులందరూ పార్లమెంటు హాల్లోనే, అనగా, వంటింట్లోనే ఉండాలి - విదేశీ పర్యటనలు చెయ్యరాదు.

వంట విషయానికి సంబంధించి వచ్చే అన్ని సందేహాల్లోనూ తనదే తుది తీర్పు.

వంట తినడానికి యోగ్యంగానూ అయోగ్యంగానూ తయారయే జయాపజయాల విషయంలో, అందరూ సమిష్టి బాధ్యత వహించాలి.

చాలా కుట్ర పన్నేడే అని ఎవరికి వాళ్ళం మనస్సుల్లో ఫెల్లు మన్నాం - కాని ఏం చేస్తాం ఎన్నుకొన్నాక? తలవంచక తప్పలేదు.

తీర్మానాలూ ప్రణాళికలూ నియమాలూ అన్నీ సిద్ధం చేసుకుని పక్కల మీదకి ఒరిగే సరికి పన్నెండయింది. ఉదయం ఆరింటికే మా ప్రయోగం ప్రారంభం.

"తెల్లారిపోయింది - పంపునీళ్ళుపట్టరా పాండురంగా" అంటూ ఎంతమందిమి చెవిలో శంఖాలు ఊదినా నీటిపారుదల శాఖమంత్రి నిద్రలేవలేదు. మా సుప్రభాతం పాటలకి పక్కింటి పాపాయిలైనా జడుసుకుని దీర్ఘాలు ప్రారంభించారుకాని, పాండు రంగ మాత్రం అటునుంచి ఇటు ఒత్తిగిలలేదు - ఇంకో గంటయితే పంపు కట్టేస్తారు. అందువల్ల మామా శాఖల పనుల్ని పక్కని బెట్టి, నలుగురం నాలుగు బిందెలూ పుచ్చుకుని పరిగెట్టాం.

కుళాయి నీళ్ళు మొయ్యడం కారణంగా కూరలు తెచ్చే కార్యక్రమం దెబ్బతింది. ఇంతెండ ఎక్కి కూరలేం తెస్తాం. అందువల్ల ఆ పూటకి కూరబదులు ఏ ఆవకాయ మాగాయ వంటి నిలయ విద్వాంసులతోనో సరిపెట్టుకుందాం అని నిర్ణయించుకున్నాం అందరం. నిద్రలో ఉన్న పాండురంగ ఎలా విన్నాడో మా నిర్ణయాన్ని - పరుపుమీంచి ఉవ్వెత్తుగా లేచి, అసమ్మతి తెలిపే అసెంబ్లీ మెంబర్లాగ పిడికిలి బిగిస్తూ "నో ... కూర ఉండాల్సిందే - వండాల్సిందే" అంటూ నినాదాలు ప్రారంభించాడు.

"అరవకు. కాలుష్య నివారణ మంత్రివి కూడా నువ్వే! అరిస్తే శబ్దకాలుష్యం వస్తుంది. అయినా నీ కుంభకర్ణుడినిద్రే ఈ ఉపద్రవానికి కారణం" అంటూ ప్రతినినాదాలిస్తూ, స్పీకర్ పోడియమ్ పైకి ఉరికే సభ్యుల్లాగ మేం అతని వైపు ఉరక బోయాం. అంతే తగ్గాడు.

తర్వాత కార్యక్రమమైన కాఫీ సేవనం సాఫీగా సాగలేదు. "ఇది కాఫీయా కిర్సనాయిలా?" అంటూ అరిచి భళ్ళున వాంతి చేసుకున్నాడు అవధాని. అతని ప్రవర్తన, తన పాక కళా ప్రావీణ్యం మీద వెలిబుచ్చుతూన్న అవిశ్వాసంగా భావించి సుబ్రహ్మణ్యం కళ్ళెర్రచేశాడు. అతనిని శాంతింపజేసి, అసలు ఇలా ఎందుకు జరిగిందో తెలుసుకోడం కోసం ఓ త్రిసభ్య విచారణ కమిటీని వేశాం, జరిగిందేమిటంటే -

'వడగట్టడానికి కాఫీగుడ్డ తేరా', అంటే, నిద్ర కళ్ళతో ఉన్న చిదంబరం, అదీ నల్లగానే ఉండడంతో, కాఫీ గుడ్డఅనుకొని కిర్సనాయిలు గుడ్డ ఇచ్చాడట. రకరకాల వాసన ద్రవ్యాలు చుట్టూ ఉండడంవల్ల, వాటి మధ్య, కాఫీ వాసనకీ కిర్సనాయిలు వాసనకీ తేడా కనిపెట్టలేక పోయాడట ప్రధాని, ఈ రోజుల్లో నిజాయితీ ఆఫీసరుకీ లంచాల ఆఫీసరుకీ తేడా కనిపెట్ట లేకపోయినట్లు.

"అది సరే - ధర్మాసుపత్రి కాంపౌండరు చిటికెడు మందుని లీటర్ సీసాలో కలిపినట్లు, నువ్వేమిటి, అడ్డెడునీళ్ళలో అరచెంచాడు కాఫీ పొడుం అయిదు చుక్కలు పాలూ కలిపి ఇచ్చావు? ఈ కాఫీ తాగడానికేనా?" అంటూ నీ నిర్వాకం ఏం ఏడిసింది అన్నట్లు ఎదురు ఎద్దేవా చేశాడు ప్రధానిని చిదంబరం.

"రోజూ ఇలాంటి కాఫీయే ఇయ్యి. ఎవ్వరూ తాగరు కనక, బోలెడు పొదుపుఅవుతుంది" అని అవధానీ. "అతిథి వస్తే ఇలాంటి కాఫీ ఇస్తే సరి - ఇంక ఛస్తే రాడు" అని పాండురంగా.

"తెనాలిరామ లింగడూ పిల్లీ లాగ, కాఫీవ్యసనం వదులుకొని కాలి కొద్దీ పరిగెట్టడానికి ఇది చక్కని మార్గం" అని నేనూ, ఇలా నలుగురం నాలుగు జోకులు విసిరే సరికి, పార్టీలో అసమ్మతి వర్గాన్ని చూసే నాయకుడిలా మాకేసి పుల్తూ పుల్తూ చూశాడు సుబ్రహ్మణ్యాం.

"నా మీద గౌరవం ఉంటే మీరా కాఫీ తాగవలసిందే!" అన్నాడు -

"నువ్వుకేబినెట్‌ని రద్దు చేసినా సరేకాని, మేం దాన్ని చచ్చినా తాగం" అంటూ నలుగురం, సారాబట్టీల్ని పగల గొట్టినట్లు ఆ కాఫీ గ్లాసుల్ని నేలకేసి కొట్టాం.

"మీ పని ఇలా ఉందా" అనుకున్నాడో ఏమో, గళ్ళాపెట్టి దగ్గర కూర్చున్న బొర్రయ్యసెట్టిలాగ, పొయ్యి ముందు, పీట మీద కదలకుండా బైఠాయించి, మా నలుగురికీ నలభై పనులు పురమాయించి, మమ్మల్ని ఊపిరి సలపకుండా పరిగెత్తించడం మొదలెట్టాడు -

"బియ్యం ఏరడం అయిందా?"

"గిన్నె ఇంకా తేవేం?"

"చింతపండుపులుసు పిసకడం ఇలాగేనా?"

"నూనెసీసా అందుకో"

"కత్తిపీట తీసెయ్యి" -

- వంటి అరుపులూ కేకలతో, వంటింటిని యుద్ధభూమిగా మార్చేసి, మా చేత చెడుగుడు ఆడించి, చెమటలు కార్పించి, కక్ష తీర్చుకున్నాడు సుబ్రహ్మణ్యాం.

సుబ్రహ్మణ్యాం పెట్టే తొందరకీ, వేసేకేకలకీ, చేసే గందరగోళానికీ, కంగారు పడిపోయి, నేలమీదున్న వస్తువులతో ఫుట్‌బాల్ ఆడేశాడు పాండురంగ.

నూనెసీసా వెళ్ళి గోడకి తగిలి గోల్‌మాల్ అయింది.

కత్తిపీట, గుండ్రంగా భూచక్రంలా తిరిగి, గిన్నెలో నీళ్ళుపట్టుకు వస్తూన్న చిదంబరం చిటికెన వేలుకి తగిలి, ఎర్రగా నవ్వింది.

'మొ(్రో' అంటూ ఆ గిన్నెడు నీళ్ళూ, నేల మీద కూర్చుని చేటలో బియ్యం ఏరుతూన్న అవధానులు నెత్తిమీద, గిన్నెతో సహా వదిలేశాడు చిదంబరం.

ఏం జరిగిందో అర్థం కాక అవదాన్లు కెవ్వున అరిచాడు.

ఢామ్ - గిర్ర్ ... బాబోయ్... దిబ్బు .. అమ్మోయ్

ఈ శబ్దాలన్నీ కలగాపులగంగా ఒకేసారి వినిపించేసరికి, ఏంకొంపమునిగిందో అని చుట్టు పక్కల వాటాల వాళ్ళంతా పరిగెట్టుకుని వచ్చి చూశారు.

చూస్తే ఏం ఉంది?

వణికి పోతూ ఒకడూ -

గోడకి షికారయి మరి ఒకడూ

గుడ్లు మిటకరించి వేరొకడూ

గుడ్లురిమి చూస్తూ ఇంకొకడూ -

చలనం లేకుండా, అందరం స్టిల్ ఫొటో గ్రాఫ్‌లో లా కనిపించాం.

నేల మీద నూనే, నీళ్ళూ, రక్తం కలిసిపోయి, త్రివేణిలా ఒక అపురూపమైన ద్రవపదార్థం, వంటింటి తూము వైపు ప్రవహిస్తోంది. ఆ గందరగోళం చూసే సరికి, దేశంలోని రాజకీయ పరిస్థితి జ్ఞాపకం వచ్చిందో ఏమో, నోరు మూసుకుని ముక్కు మీద వేలు వేసుకుని వెళ్ళిపోయారు పక్క వాటాల వాళ్ళందరూ.

మొదట ఒకర్నొకరం తిట్టుకున్నా, తర్వాత పరస్పరం అవగాహన చేసుకొని, సహజీవన సిద్ధాంతాన్నీ పంచశీల సూత్రాల్నీ మననం చేసుకుని, శాంతించాం. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలా తయారైన వంటింటిని దృశ్యమానంగా చెయ్యడం తన ఒక్కడివల్లా కాదని, పారిశుధ్య శాఖ మంత్రి కంప్లయింట్ చెయ్యడంతో, అత్యవసర పరిస్థితి ప్రకటించి, అందరం ఆ కార్యక్రమానికి పూనుకొన్నాం, చీపుళ్ళూ బ్రష్‌లూ పుచ్చుకుని.

వంటిల్లు బాగు చేసేటప్పటికి ఒంటి గంట కావచ్చింది. పొద్దుటి ఆఫీసులు పోనే పోయాయి. ఈ పూటయినా వెళ్ళాలి. కనీసం శలవు చీటీలైనా పంపాలి. లేకపోతే మూకుమ్మడిగా ఎబ్‌స్కాండ్ అయినందుకు, ఉద్యోగాలైనా ఊడొచ్చు. పోలీసు కంప్లైంటయినా వెళ్ళొచ్చు. లీవు లెటర్‌లు పట్టి గెళ్ళడానికి ఒక్కడైనా వెళ్ళాలి కదా ఆఫీసుకి? నువ్వెళ్ళు అంటే నువ్వెళ్ళుఅని, చివరికి అందరం వెళ్ళడానికి నిర్ణయించుకొన్నాం. మరివంటో? పొద్దుటి నుంచి పస్తు. ఎలాగ?

అన్నం తినకుండా ఆఫీసుకా? ఏడుపొచ్చింది.

"ఏడవకండి - ఇవాళ ఏకాదశి. ఏకాదశి ఫలం అయాచితంగా దక్క బోతోంది. ఇవాళా, రాత్రి, ఇంచక్కా భోజనం మానేసి, పాకశాస్త్ర కార్యక్రమానికి రేపు శ్రీకారం చుడితే.." అంటూ ఇంకా చిదంబరం వాక్యాన్ని పూర్తి చెయ్యనే లేదు, బక్క కోపంతో వెళ్ళి అవధాని, వాడి అంగిళ్ళు రెండూ నొక్కేశాడు వెలక్కాయ నొక్కేసినట్టు.

"మళ్ళీ ఏకాశి అన్నావో, నిన్నూ నీ ఏకాశినీ పీకలోతు గొయ్యి తీసిపాతేస్తా" అన్నాడు పాండురంగ.

దేవుడా అంటూ ఆఫీసులికి వెళ్ళి వచ్చాంకాని, వంటప్రయత్నం చెయ్యడానికి ఓపికలేదు. పోనీ అని కడుపులో కాళ్ళెట్టుకుని పడుకుందాం అంటే, కడుపులో కెనేడియన్ ఇంజెన్లు అరుస్తున్నాయి.

"స్వహస్త పాకం అన్నవాడెవడ్రా మనలోమొదట!" - తినేసేటట్లు చూస్తూ అడిగాడు అవధాని. చెబితే, నిజంగా వాణ్ణి తినేటట్లు ఉన్నాడు.

"ఎవడో ఒకడు - నువ్వు నోరు మూసుకో వర్తినే అరవకు" అన్నా.

"నువ్వే నోరుమూసుకో"

"ఏడిశావు"

'నువ్వే ఏడిశావు"

ఇలా బక్క కోపం పెరిగిపోతోంది ఒక్కొక్కడికీ - కాస్సేపుంటే ఎక్కడ తన్నుకు ఛస్తారో అని కాళ్ళీడ్చుకుంటూ బజారుకి పోయి డజనుబత్తాయి పళ్ళూ, రెండు డజన్ల అరటిపళ్ళూ రెండు బిస్కెట్ పేకెట్లూ పట్టుకొచ్చా.

అంతే! మా గడేకారు సజ్జు మొహాలు విప్పారాయి. లంచం మరిగిన ఆఫీసర్లు లాగా, పచ్చగడ్డి చూసిన పశువుల్లాగా, అమాంతం ఎగిరి, పళ్ళ మీద కురికారు. అయిదునిముషాలయ్యేసరికి ఒక్క పండులేదు. వాళ్ళ ధర్మమా అని తొక్కలు వదిలేశారు. నయం.

"ఏరా! స్వహస్త పాకం మానేద్దామా" అని అడిగాను అవధానిని. 'వద్దు' ని తలఅడ్డంగా ఊపాడు. కడుపులో చల్లబడిన కారణంగా "అవునవును. ఇవాళ కలిసి రాలేదు. రేపు ప్రారంభిద్దాం పకడ్బందీగా" అన్నారంతా -

"కేబినెట్‌లో కలకలం వచ్చింది. ఇంకేం ఉంది - ఈ పాకశాస్త్ర ప్రభుత్వం పడిపోతుంది. తెల్లారితే అయ్యలంతా అయ్యరు హోటల్‌కి తయారే" అని చంకలుకొట్టుకొన్న, పక్క వాటాల్లోని ప్రతి పక్షీయుల అంచనాలన్నీ తారుమారు చేస్తూ అందరం మర్నాడు టంచన్‌గా ఏ..దు గంటలకి లేచాం. ఎవరి పోర్టు

ఫోలియోలు వారివే అని క్రితం రాత్రే అనుకోవడంవల్ల, నాది రవణా శాఖ, కూరల కొట్లు ఇంకా తెరవరు కనుక, లేవచ్చులే అని నేను ఒక్కణ్ణే, ఇంకా నిద్రా మెళుకువల మధ్య,కుస్తీ పడుతున్నాను.

హిరోషిమా మీద ఆటంబాంబు పడినట్లయింది. ఉలిక్కిపడిలేచి కూర్చున్నాను. నిండు నీళ్ళ బిందెతోసహా పాండురంగ, దిబ్బుమని పడ్డాడనీ, అది చూసి కేబినెట్ మెంబర్లంతా కెవ్వుమన్నారనీ, అర్థం అయింది.

హాలంతా చెరువై పోయింది. పాలకీ నీళ్ళకీ పెద్ద పట్టింపులేకుండా, ఆ నీళ్ళనే పాలుగా భావించి శేషతల్పశాయిలా స్పృహ తప్పిపడిఉన్నాడు పాండురంగ. గూడకట్టుపంచె అవిశ్వాస తీర్మానంలా కాళ్ళకి అడ్డుపడ్డంతో, నడ్డి విరిగి పడ్డాడని నిశ్చయించి, నలుగురం ఓం ఓం అంటూ మోసుకెళ్ళి, పాండు రంగని పాన్పు మీదకి చేర్చాం.

సకలోపచారాలూ అరమోడ్పుకన్నులతో స్వీకరించి, ఆపైన కళ్ళు తెరిచి, నాలుగు రోజులదాకా నడ్డి స్వాధీనం కాదన్నట్లు సంజ్ఞచేశాడు. "పంపు నీళ్ళు మోసే బాధ తప్పుతుందని ఈ ఎత్తు వేశాడు - నాటకం బాబోయ్! నాటకం" అంటూ నలుగురం ఎవరిమనస్సుల్లో వాళ్ళమే నిశ్శబ్దంగా ఘెల్లుమన్నాం.కాని ఏం చేస్తాం? వాడి శాఖని తలో బిందె చొప్పున పంచుకొని, ఎవరి శాఖలు వాళ్ళం నిర్వహించాం.

సవ్యసాచిలా రెండు చేతుల్లోనూ రెండు కూరగాయల సంచులూపుచ్చుకొని నేను వచ్చేటప్పటికి, అన్నం గిన్నెతో అవస్థపడుతున్నాడు సుబ్రహ్మణ్యం. కాస్సేపు చూసి "ఇప్పుడు లైపిండి ఎందుకురా వండుతున్నావు?" అనడిగా.

"లైపిండి ఏవిటి నీ మొహం - అన్నమే"

"మరయితే అస్తమానూ అలా గరిటితో కలపడం ఎందుకు?" అన్నా "నీకు తెలియదు నువ్వూరుకో" అని నన్నో కసురు కసిరి బెండకాయలు తెచ్చావా? అని వాకబుచేసి "ఒరేయ్ అవధానీ! ఆ బెండకాయలు, వేపుడు కోసం సన్నగా నీళ్ళలో తరిగి జాడించి ఇల్లాఇయ్యి" అంటూ గబగబా జీవోలు పాసు చేశాడు సుబ్రహ్మణ్యం.

నాకు గల కొద్ది జ్ఞానంతో "ఒరేయ్. బెండకాయలు నీళ్ళలో తరిగిపిసికితే, జిగురొచ్చి, పశ్శాంపుశ్శాం అయి తగలడతాయిరా!" అని అరిచాను.

స్వంత పార్టీ మీటింగ్‌లో పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తే తిరుగుబాటు అభ్యర్థిని చూసినట్లు నన్ను చూసి, కోపంగా "అరిటికాయ ముక్కలూ వంకాయ ముక్కలూ నీళ్ళలోకి తరగమా? అలాగే బెండకాయ ముక్కలూను, మనది సమసమాజం. వాటికి

లేని ప్రత్యేక గౌరవాలు వీటికేవిటి? నేను చెప్పినట్లు చెయ్యండి" అన్నాడు సుబ్రహ్మణ్యం.

నీళ్ళలోకి తరగడంతో ఊరుకోకుండా, బెండకాయ ముక్కల్ని అవధాని పిసక సాగాడు. బెండకాయజిగురు, తీగలతో ప్రారంభం అయి,క్రమేపీ గట్టిపడి మొదట మిఠాయి పాకానికి చేరి,తర్వాత జీళ్ళపాకంగా మారింది. అవధాని వేళ్ళు ఒకదానికొకటి అంటుకు పోయాయి. ముక్కలన్నీ కలిపి ఒకే ఒక జిగురు ముద్దగా తయారయ్యాయి. వాటి పరస్పర సంఘీభావం చూసి, నాకు మహా ముచ్చటేసింది. "చూడండిరా ఆ బెండకాయ ముక్కలు ఎంత అన్యోన్యంగా ఉన్నాయో! మనమూ ఉన్నాం రోజా కీచులాడుకుంటూ" అన్నా-

ఆ మాటకి అందరూ నా మీదకి విరుచుకు పడ్డారు. "ఆఫ్టరాల్ బెండకాయల ముక్కల్తో పోలుస్తావా మమ్మల్ని? అవధానీ - ఆ ముద్ద అవతలపడెయ్యి. అందమైన అరిటికాయలు రెండు తరుగు. వేయిస్తాను" అన్నాడు సుబ్రహ్మణ్యం.

'గుల్లల్లా వేయిస్తే, అరటి కాయవేపడం బహుపసందుగా ఉంటుంది' అని కాస్సేపు ఊహాలోకాల్లో తేలిపోయి అటుచూద్దును కదా -

వేయిస్తూన్న అరిటికాయముక్కల్లో పచ్చిమిరపకాయముక్కలూ, అల్లం ముక్కలూ, ఆవాలూ మెంతులూ జీలకర్రా వగైరా పోపులపెట్టె సంబారాలన్నీ వేసి ఆపైన నిమ్మకాయపిండబోతున్నాడు సుబ్రహ్మణ్యం.

నేను అడ్డుకొని "నువ్వు చేస్తున్నది వేపడమా, కూరా?" అన్నా -

"రెండూను" అంటూ నన్ను దూరంగా తోసిపారేశాడు, పబ్లిక్ సెక్టర్నీ ప్రైవేట్ సెక్టర్నీ ప్రోత్సహిస్తూ మిక్సెడ్ ఎకానమీని గౌరవించే భారత ప్రభుత్వంలా.

"నేనీ దహనకాండ చూడలేను" అంటూ వీధిలోకి వెళ్ళి కూర్చున్నాను.

"హూప్ హూప్" అంటూన్న శబ్దాలు విని లోపలికి వచ్చి చూద్దును గదా -

అన్నం గిన్నెలో గుచ్చిన గరిటె పట్టుకుని అవధానీ చిదంబరం అటూ, అన్నం గిన్నెని పట్టుకొని సుబ్రహ్మణ్యం ఇటూ, ఆరెండింటినీ విడదియ్యడం కోసం కాబోలు టగ్ ఆఫ్ వార్ ఆడుతున్నారు.

"ఆకలిరా బాబోయ్!" అంటూ నడ్డిపట్టుకొని వంటింట్లోకి నడకసాగించిన పాండురంగ, ఆదృశ్యం చూసి, రెండు పార్టీలూ సమఉజ్జీగా ఉండడంకోసం, సుబ్రహ్మణ్యం వైపు చేరి, వాడి నడ్డి పట్టుకొని, నేలని తొక్కి పట్టి 'హుప్' అంటున్నాడు.

ఆ సమయంలో నేను అక్కడి కెళ్ళాను.

"ఏమైందిరా! ఏవిటిది?" అన్నాను.

"చచ్చు ప్రశ్నలు వెయ్యక, వచ్చి సాయం చెయ్యి" అన్నాడు సుబ్రహ్మణ్యం కోపంగా సరే - కాస్సేపు అటూ, కాస్సేపు ఇటూ సాయం చేశాను. గిన్నెలోంచి గరిటె వస్తేనా? కాశ్మీరు సమస్యలా బిగుసుకుపోయింది.

"ఒరేయ్ ఇలా కాదురా. నేను అంపైర్‌లా మధ్యన నిలబడతాను. మీరిద్దరూ ఇటూ, వాళ్ళిద్దరూ అటూ గట్టిగా లాగండి" అంటూ గడుసుగా పోటీలోంచి తప్పుకున్నాడు సుబ్రహ్మణ్యం.

దొంగ వ్యాపారీ లంచాల ఆఫీసరూ అనుబంధంలా, గిన్నెకీ గరిటెకీ గల స్నేహం బిగిసిపోయి, విడిపోక, ఓ పక్కనుంచి మేం ఛస్తూంటే, "ఊ అలాగే... లాగండి. .. గట్టిగా" అంటూ సుబ్రహ్మణ్యం కేకలు ఒకటి.

ఉడికినంతసేపూ పనిమాలా కలిపిందే కలుపుతూ, నిక్షేపంలాంటి అన్నాన్ని లైపిండి చేసి తగలెయ్యడమే కాకుండా, ఈ కేకలు కూడా ఏమిటి? చెప్పొద్దూ - ఆ మట్టున వెళ్ళి, నెత్తిమీద ఓ చెయ్యీ గెడ్డం కింద ఓ చెయ్యీవేసి, అంగిళ్ళు అప్పడంలా నొక్కి, పారేద్దాం అన్నంత కోపం వచ్చింది నాకు -

ఆ కోపంలో గట్టిగా నేల తన్నిపెట్టి, పెదిమలు బిగబట్టి 'హుప్' అంటూ లాగాను. అంతే! ధన్‌మంటూ వెళ్ళి, మేం ఈగోడకీ, వాళ్ళు ఆ గోడకీ షికారు అయ్యాం. తలలు బొప్పికట్టడం మాట ఎలా ఉన్నా, తప్పేలాగిన్నీ, గరిటే అనేవి రెండు వేరు వేరు పదార్థాలని ఎలాగైతేనేం నిరూపించ గలిగాం.

"భగవంతుడా! ఈ అన్నాన్ని తినాలి కాబోలు" అనే ఆలోచన వచ్చేసరికి, రాబోయే కమ్యూనిజాన్ని తల్చుకున్న బూర్జువా గుండెలులాగ, మాగుండెలు కూడా భయంతో కంపించి పోయాయి. ఈ లైపిండిని తినడంమాటదేముదెరుగును, అసలు దీన్ని విస్తట్లో వడ్డించడం ఎలాగ? ఇందాకటి అవస్థ చూస్తే గరిటెని మళ్ళీ అన్నంలో గుచ్చడానికే భయం వేస్తోంది!

అందరికీ ఆకలి అర్జంటుగా మాయం అయిపోయింది.

"నాకేవిటో, ఇవాళ ఆకలి వెయ్యడం లేదురా" అని ఒకడూ, 'నాకూ అలాగే ఉందిరా' అని మరొకడూ, "అన్నం చూసేసరికి ఉన్న ఆకలి కాస్తా హరించుకు పోయిందిరా బ్రదర్" అని ఇంకొకడూ - ఇలా అందరం తలో ప్రకటనా చేసేసరికి, కోపంతో అరవడం ప్రారంభించాడు సుబ్రహ్మణ్యం.

"ఆకలిలేదూ! మానెయ్యండి - ఉన్నట్టుండి అందరికీ ఒక్కమాటే ఎలా మాయం అయిపోయిందో - నాకు తెలుసురా - నాకు తెలుసు. ఇదంతా, మీరు నావంట మీద

తీసుకురాబోతూన్న అభిశంసన తీర్మానానికి నాంది. మీరు అవిశ్వాసం ప్రకటించేదాకా ఆగుతానా? ఇప్పుడే కేబినెట్‌ని రద్దు చేసి పడేస్తా. పదవులు పోయి కుర్రోమొర్రో అంటారో, అయ్యరు హెటల్‌కే తిరిగి అఘోరిస్తారో మీ ఇష్టం"

వాడి ప్రకటన వినేసరికి మా గుండెలు గుభేలు మన్నాయి. ఏదైనా భరించగలం. పదవులు పోతే బ్రతగ్గలమా? అయ్యరు హెటల్ అంటే, తిరిగి పరతంత్రపాలనలోకి పోయినట్లే -

"ఏవిటి నువ్వు - అస్తమానూ బెదిరిస్తావు?" అన్న చిదంబరం చిందులుతో, వ్యవహారం మరింత బిగిసింది.

"నేను వండిన లైపిండి తినాల్సిందే!" అని ప్రధానీ,

"ఆ పాకం చలిమిడి చచ్చినా తినం" అనిమంత్రులూ - కేబినెట్ క్రైసెస్‌లో పడింది.

ఈ పీట ముడి ఎలా విప్పడం?

అలనాడు కాశ్మీరులో మహమ్మదు ప్రవక్తగారి శిరోజం మాయమైనప్పుడు, హోం మంత్రి అయిన లాల్ బహదూర్ శాస్త్రి ఎదుర్కొన్నదానికంటే, జటిలమైన సమస్య అయిపోయింది ఇది -

"ఎలా దీన్ని పరిష్కరించడం దేవుడా"అని నలుగురం నాలుగ్గదుల్లోకీ పోయి, తలలు బద్దలు కొట్టుకుంటూన్న సమయంలో, వంటింట్లో పెద్ద శబ్దం అయింది.

మామొర ఆలకించి భగవంతుడుకాని వచ్చాడేమోనని నలుగురం వంటింట్లోకి పరిగెట్టాం.

కుక్క!

నిజంగా మహావిష్ణువు లాగ నల్లగా మెరిసిపోతూ, మా సమస్య పరిష్కరించడానికో అన్నట్లు, ఆ లైపిండి గిన్నెలో తలదూర్చి, తిరిగి దాన్ని బయటికి తీసుకోలేక, ఇటూ అటూ పరిగెడుతూ, ఆ గోడకీ ఈ గోడకీ కొట్టుకుంటూ, నా నా హంగామా చేస్తూ, అవస్థపడుతోంది.

"అయ్యో... అయ్యో.." అంటూ మేం అయిదుగురం, ఆ కుక్కని అన్ని దిక్కుల నుంచీ ముట్టడించి అష్టదిగ్బంధనంచేసి, మొత్తంమీద ఎలా అయితేనేం, దాని తలని గిన్నెలోంచి బయటికి లాగాం. బతుకు జీవుడా అనుకుందో ఏమో, అదే పరుగు. అది వదిలి వెళ్ళిన గిన్నెలోకి తొంగిచూద్దుము కదా, పాపం అది కొంచెం అంటే కొంచెం కూడా తినలేక పోయిందని అర్థం అయింది.

"అటువంటి కుక్కే తినలేక పోయాక మనం తినగలమా ఈ లైపిండి?" అంటూ చిదంబరం ఓ చెణుకు విసరబోతూంటే, అది సుబ్రహ్మణ్యం చెవిని పడకుండా నేను అమాంతం వెళ్ళి వాడినోరు నొక్కాను. లేకపోతే ఇంకేమైనా ఉందా? అసలే అంతంత మాత్రంగా ఉన్న మా మంత్రి మండలి ఐక్యత, బేంకుల జాతీయకరణవల్ల రెండు చెక్కలైన కాంగ్రెసులాగ, ఢామ్మని బ్రద్దలైపోదూ?

కాస్సేపు ఎవరి ఆలోచనల్లో వాళ్ళం ఉండిపోయాం. తర్వాత అవధాని బిక్క మొహం పెట్టి, "సుబ్రహ్మణ్యం! నీమాటని గౌరవించం అని కాదు. మరీ చూస్తూ చూస్తూ కుక్క ముట్టుకున్న అన్నం ఎలా తినంరా? నువ్వే చెప్పు. నీ పట్టుదల మానెయ్యి. కేబినెట్ రద్దు చెయ్యకు" అని ప్రాధేయ పడ్డాడు.

సుబ్రహ్మణ్యం ఎంతో ఔదార్యంతో "నేను మాత్రం కుక్కముట్టుకున్న అన్నం తినమంటానేవిట్రా?" అన్నాడు.

హమ్మయ్య! పీటముడి విడిపోయింది.

ప్రధాన మంత్రి రాజీనామా చెయ్యడం లేదు. కేబినెట్‌ని రద్దు చెయ్యడం లేదు.

అంటే?

కుక్క ధర్మమా అని మా మంత్రి పదవులు మాకు పోకుండా ఉన్నాయన్నమాట!

ఎంత చల్లని వార్త!

మా పాక శాస్త్ర ప్రయోగం ఆపనక్కర్లేదు.

రెండు రోజుల కటిక ఉపవాసంతో కడుపు నకనకలాడిపోతూన్నా, పట్టలేని సంతోషంతో

"సుబ్రహ్మణ్యానికీ జై!

పాక శాసన పార్టీకీ జై!

వంటనేర్చేమగాళ్ళకీ జై!

అని అరిచాను. మిగిలిన మా బ్రహ్మచారి ముఠా, అదే - గడేకారు సజ్జు - నా గొంతులో గొంతుకలిపారని వేరే చెప్పక్కర్లేదు!

*(1996)*